RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ సంపుటి: 4 సంచిక:126 | శనివారం మే 09, 2026 | పేజీలు 8 వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260



## హంటా అలెర్ట్

శరవేగంగా వ్యాపిస్తున్న వైరస్

డచ్ క్రూయిజ్ షిప్‌లో ముగ్గురు మృతి

ప్రపంచ దేశాలను అప్రమత్తం చేసిన డబ్ల్యూహెచ్ఓ

2లో



# చెదిరిన చరిత్ర!

## 800 ఏళ్ల నాటి కాకతీయ కళా సంపద నేలమట్టం

2లో

- గణపతిదేవుని గడ్డపై పాలకుల విధ్వంసం
- మట్టికోట సాక్షిగా.. కూలిన చారిత్రక శివాలయం
- వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో శిల్పకళా మౌన రోదన
- పురావస్తు శాఖ పరిధిలో ఉండగానే కూల్చివేత
- గతంలో పునరుద్ధరణ పనులు ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేత
- మైలిసెట్టి కుమారుడు అప్పిసెట్టి వేయించిన శాసనాలు మట్టిపాలు
- ఎవరి కోసం ఈ విధ్వంసం అంటూ ప్రశ్నిస్తున్న చరిత్రకారులు
- తక్షణమే ఆలయాన్ని పునరుద్ధరించాలని డిమాండ్

**వేద న్యూస్, (ఎల్.కే) ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ అస్తిత్వానికి ఆనవాళ్లు.. కాకతీయ చక్రవర్తుల శిల్పకళా వైభవానికి సజీవ సాక్ష్యాలు.. ఎనిమిది శతాబ్దాల కాలగమనాన్ని, భీకర వరదలను తట్టుకుని నిలిచిన ఆ మహత్తర వారసత్వం నేడు పాలకుల నిర్లక్ష్యానికి, అధికారుల అత్యుత్సాహానికి బలైపోయింది. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో.. స్వయంగా గణపతిదేవుని కాలం నాటి చరిత్రను చాటిచెప్పే 800 ఏళ్ల పురాతన శివాలయం నేడు బుల్డోజర్ల కింద నలిగి, శిథిలాల కుప్పగా మారింది. మైలిసెట్టి కుమారుడు అప్పిసెట్టి వేయించిన శాసనాలు, 'రాజగజకేసరి' వంటి వీర బిరుదులు సాక్షిగా వెలిగిన ఆ చారిత్రక వైభవం ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయింది. పురావస్తు శాఖ రక్షణలో ఉండాల్సిన వారసత్వ సంపదను పాలకులే స్వయంగా నేలమట్టం చేయడంపై చరిత్రకారులు, భక్తులు భగ్గుమంటున్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని సమాధి చేస్తున్న ఈ విధ్వంసంపై 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం..

# రిటైర్డ్ ఐపీఎస్ భార్యను చంపింది నేపాలీ పని మనిషే



మరో ఇద్దరితో కలిసి హత్య

- బంగారం, డబ్బుల కోసమే ఘాతుకం
- కేసులో సంచలనం విషయాలు వెలుగులోకి..
- పథకం ప్రకారమే మర్డర్
- దర్యాప్తును పర్యవేక్షిస్తున్న డీజీపీ

2లో

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి



- పోలీస్ వ్యవస్థను రాజకీయాలకు వాడుకుంటున్నారు
- ప్రజల భద్రత నిర్లక్ష్యానికి గురవుతోంది
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

2లో

## 'తుమ్మిడిహెట్టి'కి మళ్లీ ఊపు

ఆదిలాబాద్‌లో ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు



2లో

# కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- విద్య, పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి
- 2027 నాటికి పనులు పూర్తి
- సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్ అభివృద్ధిపై ఫుల్ ఫోకస్
- బాలాజీ ఆలయానికి భూమిపూజ



**వేద న్యూస్, కొడంగల్**

అభివృద్ధి విషయంలో రాజకీయాలు, గుంపులు, గ్రూపులు పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కొడంగల్‌లో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం.. నియోజకవర్గ భవిష్యత్‌పై భారీ ప్రణాళికలను వెల్లడించారు. కొడంగల్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొడంగల్ బాలాజీ ఆలయాన్ని తెలంగాణ పేదల తిరుపతిగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కూడా సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే దౌల్తాబాద్

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

శనివారం మే 09, 2026

## శాంతిభద్రతలు క్షీణించాయి

### కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న నేర ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగాన్ని రాజకీయ కక్ష సాధింపులకు, ప్రతిపక్ష నాయకులను వేధించడానికి వినియోగిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల భద్రత, రక్షణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని అన్నారు. శాంతిభద్రతల పరిస్థితిపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే హైదరాబాద్ ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య హత్యకు గురవడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అదే విధంగా సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై యువకుడిని కత్తితో పొడిచి చంపిన ఘటన ప్రజల్లో భయాందోళనలు పెంచిందని అన్నారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్రంలో పెరుగుతున్న అభద్రతా పరిస్థితులకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. నేరాల నియంత్రణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వాన్ని విమర్శించే సోషల్ మీడియా వేదికలపై కేసులు పెట్టడానికి వినియోగిస్తోందని ఆరోపించారు. పోలీస్ వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకోవడం వల్లే శాంతిభద్రతలు కుప్పకూలాయని కేటీఆర్ అన్నారు. మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు రాష్ట్రంలో భారీగా పెరిగాయని తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలను ప్రస్తావించారు. హోంశాఖను కూడా తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో విఫలమయ్యారని విమర్శించారు.

## 'తుమ్మిడిహెట్టి'కి మళ్లీ ఊపు

**వేద న్యూస్, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును మంత్రి జూపల్లి కృష్ణారావు సహచర మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో కలిసి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి బరాజ్‌కు 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి భూమిపూజ చేశారని మంత్రి గుర్తు చేశారు. రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 106 కిలోమీటర్ల కాల్వ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ఇప్పటికే 71.5 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయిందన్నారు. అలాగే 46 కిలోమీటర్ల కాల్వ నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టుపై దృష్టి పెట్టిందని మంత్రి విమర్శించారు. గ్రావిటీ ద్వారా తరలించాల్సిన నీటిని పంపుల ద్వారా ఎత్తిపోసే విధానంతో భారీ ఆర్థిక భారం పెరిగిందని అన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో చర్చలు జరిపి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. భూములు కోల్పోయే రైతులకు తగిన పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

## కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- సీఎం రేవంత్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతంలో ఇప్పుడు సమగ్ర అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. కొడంగల్ ప్రాంతాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళిక రూపొందించినట్లు సీఎం వెల్లడించారు. 225 ఎకరాల్లో మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ, సైనిక్ స్కూల్స్‌తో కూడిన ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గతంలో చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు కొడంగల్‌కు వచ్చే పరిస్థితిని తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ప్రాంతాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. కృష్ణా నది జలాలతో ఈ ప్రాంత భూములు తడవాలని, ఇందుకోసం భూసేకరణ పూర్తైందని, అవసరమైన అనుమతులు కూడా వచ్చాయని తెలిపారు. పనుల పురోగతిపై ప్రతి నెల సమీక్ష నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరారు. ఈ ప్రాంతంలో రైల్వే, పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కృష్ణా–వికారాబాద్ రైల్వే లైన్‌కు సూత్రప్రాయ అనుమతి వచ్చిందని వెల్లడించారు. టేకులగోడు ప్రాంతంలో భారీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆరు నెలల్లో పరిశ్రమ నిర్మాణం ప్రారంభమైతే స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. లగచర్ల వద్ద భారీ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం చేపడుతున్నామని, కోస్గి నుంచి అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 300 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణం జరుగుతోందని సీఎం వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కొడంగల్ ప్రాంత ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారిపోతుందని చెప్పారు. కొడంగల్ బాలాజీ ఆలయం పునర్నిర్మాణం రాజకీయాలకు అతీతమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని సీఎం స్పష్టం చేశారు.

# చెదిరిన చరిత్ర!

## 800 ఏళ్ల నాటి కాకతీయ కళా సంపద నేలమట్టం

- గణపతిదేవుని గడ్డపై పాలకుల విధ్వంసం
- మట్టికోట సాక్షిగా.. కూలిన చారిత్రక శివాలయం
- వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో శిల్పకళా మౌన రోదన
- పురావస్తు శాఖ పరిధిలో ఉండగానే కూల్చివేత
- గతంలో పునరుద్ధరణ పనులు ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేత
- మైలిసెట్టి కుమారుడు అప్పిసెట్టి వేయించిన శాసనాలు మట్టిపాలు
- ఎవరికోసం ఈ విధ్వంసం అంటూ ప్రశ్నిస్తున్న చరిత్రకారులు
- తక్షణమే ఆలయాన్ని పునరుద్ధరించాలని డిమాండ్







**వేద న్యూస్, (ఎల్.కే) ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ గడ్డపై కాకతీయుల పాలన అంటేనే ఒక స్వర్ణయుగం. శిల్పకళకు జీవం పోసిన ఆలయాలు, గొలుసుకట్టు చెరువులు, శత్రుదుర్భేద్యమైన కోటలు.. ఇవే నేటికీ మన అస్తిత్వానికి ఆనవాళ్లు. ఆధునిక ఇంజనీరింగ్‌కు సవాలు విసిరేలా వందల ఏళ్ల క్రితమే అద్భుత కట్టడాలను నిర్మించిన కాకతీయ చక్రవర్తుల వారసత్వ సంపదపై పాలకులు తమ ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో వెలసిన 800 ఏళ్ల నాటి పురాతన శివాలయాన్ని నేలమట్టం చేయడం ఇప్పుడు తెలంగాణవ్యాప్తంగా సంచలనంగా మారింది. వారసత్వ సంపదను కాపాడాల్సిన పాలకులే స్వయంగా కూల్చివేతలకు పాల్పడటంపై చరిత్రకారులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు గొప్పగా పిలిచే మట్టికోట శిథిలాల మధ్య ఉన్న కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయాన్ని ధ్వంసం చేయడం ఎవరి కోసమనే పలు అనుమానాలతో పాటు స్థానికులు, చరిత్రకారులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది.

### గణపతిదేవుని కాలం నాటి ఘన చరిత్ర

అశోక్‌నగర్ సమీపంలో మట్టికోట మధ్యలో విరాజిల్లిన ఈ శివాలయానికి ఎంతో విశిష్టమైన చరిత్ర ఉంది. వరంగల్ జిల్లా విజ్ఞాన సర్వస్వం, శాసన సంపుటులు, యాన్వల్ రిపోర్ట్ ఆన్ ఎపీగ్రఫీ వంటి చారిత్రక ప్రామాణిక గ్రంథాల్లో ఈ ఆలయ ప్రస్తావన ఉంది. క్రీ.శ. 1232 ఫిబ్రవరి 7వ తేదీన ఈ ఆలయం వద్ద వేయించిన తెలుగు శాసనం ప్రకారం.. కాకతీయ సామ్రాజ్య సార్వభౌముడు గణపతిదేవుని కాలంలోనే ఈ ఆలయం అత్యంత వైభవోపేతంగా వెలిగింది.

### శాసనాల్లోనూ సజీవ సాక్ష్యం

మైలిసెట్టి కుమారుడు అప్పిసెట్టి, సోమనాథదేవుని (శివుడి) నిత్య దీపారాధన కోసం రెండు మాడలను దానం చేసినట్లు ఈ శాసనం వివరిస్తోంది. ఆ కాలంలోనే ఆ నిధిని వడ్డీకి ఇచ్చి, ఆ ఆదాయంతో ఆలయంలో అఖండ దీపారాధన చేయాలని నిబంధన విధించారు. ఇది కాకతీయుల కాలం నాటి దేవాలయ పరిపాలన దక్షతకు, ఆర్థిక వ్యవస్థకు, వారు పాటించిన భక్తి సంప్రదాయాలకు నిలువెత్తు సాక్ష్యం. అటువంటి మహత్తర చరిత్ర ఉన్న ఆలయాన్ని నేడు కుప్పలుగా మార్చడం తెలంగాణ సంస్కృతిని అవమానించడమే.

### కాకతీయ ఆలయాలూ నేలమట్టమే

పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అత్యుత్సాహం వెరసి వందల ఏళ్లనాటి చరిత్ర నేలమట్టమైంది. స్థానికులు 'కోటకట్ట'గా పిలుచుకునే ప్రాంతంలో ఉన్న పురాతన శివాలయాన్ని కుప్పలుగా మార్చిపడేశారు. వందల ఏళ్లుగా పూజలందుకున్న గుడిని, పవిత్రమైన ఆలయ ప్రాంగణాన్ని ఇలా ధ్వంసం చేయడం దారుణమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక కట్టడాల పట్ల గౌరవం లేని వారి పాలన కొనసాగుతోందని చరిత్ర ప్రేమికులు మండిపడుతున్నారు.

### రాష్ట్ర పురావస్తు శాఖ మౌనం..

ఈ ఆలయం రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలో ఉన్నప్పటికీ, ఈ విధ్వంసం జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారసత్వ సంపదను పునరుద్ధరించాలని గతంలో విన్నవించినా పట్టించుకోని అధికారులు, ఇప్పుడు దానిని పూర్తిగా నేలమట్టం చేయడానికి ఎలా అనుమతించారనేది మిస్టరీగా మారింది. తెలంగాణ అస్తిత్వం మీద, ఇక్కడి చరిత్ర మీద కనీస అవగాహన లేని వారి వల్లనే మన మూలాలు కనుమరుగవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అపురూపమైన శిల్పకళా సంపద శాశ్వతంగా నశించిపోయే ప్రమాదం ఏర్పడింది.

### పునరుద్ధరించాలని నిరసన జ్వాలలు

తెలంగాణ ఆత్మగౌరవానికి చిహ్నమైన కాకతీయ ఆలయాన్ని ధ్వంసం చేయడం అంటే 800 ఏళ్ల చరిత్రను సమాధి చేయడమే. ఈ విధ్వంసాన్ని తక్షణమే ఆపి, శిథిలాలను సేకరించి పాత పద్ధతిలోనే ఆలయాన్ని పునరుద్ధరించాలని ప్రజలు, చరిత్రకారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి చారిత్రక సంపదను కాపాడాలని, లేనిపక్షంలో తెలంగాణ ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరిస్తున్నారు. కాకతీయుల ఆనవాళ్లు లేని వరంగల్ ఉనికిని కోల్పోతుందని, ఇప్పటికైనా సీఎం జోక్యం చేసుకుని ఈ అపచారాన్ని సరిదిద్దాలని చరిత్రకారులు వేడుకుంటున్నారు.

### ఆనవాళ్లు కోల్పోయిన వారసత్వం

ఈ ప్రాంత శాసనాల్లో గణపతిదేవుణ్ణి 'శ్రీమన్మహారాజాధిరాజులైన' అని సంబోధించడం వారి సార్వభౌమాధికారానికి గుర్తింపు. కాకతీయ శాసనాల్లో కనిపించే 'రాజగజకేసరి', 'దాయగజకేసరి' వంటి బిరుదులు వారి పరాక్రమాన్ని ప్రతిబింబిస్తాయి. అశోక్‌నగర్‌తో పాటు గుడితండా, దిచ్చకుంట వంటి మారుమూల ప్రాంతాల్లో లభించిన ఇటువంటి ఆధారాలే తెలంగాణ చరిత్రకు విలువైన ఆస్తులు. గడిచిన 800 ఏళ్లుగా భీకర వరదలను, కాలగమనాన్ని తట్టుకొని సగర్వంగా నిలబడిన ఆ మట్టికోట, ఆ శివాలయం.. నేడు అధికారుల అత్యుత్సాహానికి బలైపోయాయి. పురావస్తు శాఖ రక్షణలో ఉండాల్సిన కట్టడాన్ని బుల్డోజర్లతో ధ్వంసం చేయడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## హంటా అలెర్ట్



**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

ప్రపంచాన్ని వణికించిన కోవిడ్ మహమ్మారి తర్వాత ఇప్పుడు హంటా వైరస్ మరోసారి అంతర్జాతీయ ఆందోళనకు కారణమవుతోంది. ఇటీవల డచ్ క్రూయిజ్ షిప్ ఎంవీ హోండియస్లో హంతా వైరస్ కేసులు బయటపడటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తమైంది. ఈ వైరస్‌కు సంబంధించిన కేసులు పలు దేశాల్లో నమోదవుతున్న నేపథ్యంలో సభ్య దేశాలను జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం.. ప్రస్తుతం హంతా వైరస్‌కు సంబంధించిన ఐదు నిర్ధారిత కేసులు, మరికొన్ని అనుమానిత కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ వైరస్ బారినపడి ఇప్పటికే ముగ్గురు మృతి చెందినట్లు వెల్లడించింది. మరణించిన వారిలో డచ్ దంపతులతో పాటు జర్మనీకి చెందిన వ్యక్తి ఉన్నట్లు సమాచారం. ఈ వైరస్ వ్యాప్తికి కేంద్రంగా మారిన డచ్ క్రూయిజ్ షిప్‌లో మొత్తం 23 దేశాలకు చెందిన 149 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వైరస్ బయటపడకముందే కొందరు ప్రయాణికులు వివిధ దేశాలకు వెళ్లిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంస్థలు కాంటాక్ట్ ట్రేసింగ్ చేపట్టాయి. హంతా వైరస్ సాధారణంగా ఎలుకల మూత్రం, లాలాజలం, విసర్జన ద్వారా వ్యాపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఘటనలో గుర్తించిన ఆండీస్ రకం వైరస్ వ్యక్తి నుంచి వ్యక్తికి కూడా వ్యాపించే అవకాశం ఉండటంతో ఆందోళనలు పెరిగాయి. అయినప్పటికీ సాధారణ ప్రజలకు ప్రస్తుతం ముప్పు తక్కువగానే ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది. వైరస్ నియంత్రణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ వివిధ దేశాలతో కలిసి పనిచేస్తోంది. బాధితులతో సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించి వైద్య పర్యవేక్షణలో ఉంచుతున్నారు. క్రూయిజ్ షిప్‌ను ప్రత్యేక నియంత్రణలో ఉంచి వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. హంతా వైరస్ లక్షణాలు మొదట జ్వరం, శరీర నొప్పులు, అలసట రూపంలో కనిపించి తర్వాత తీవ్రమైన శ్వాసకోశ సమస్యలకు దారితీయవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం దీనికి ప్రత్యేక వ్యాక్సిన్ లేకపోవడంతో ముందస్తు జాగ్రత్తలే కీలకమని ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి.

### శరవేగంగా వ్యాపిస్తున్న వైరస్

- డచ్ క్రూయిజ్ షిప్‌లో ముగ్గురు మృతి
- ప్రపంచ దేశాలను అప్రమత్తం చేసిన డబ్ల్యూహెచ్ఓ

### రిటైర్డ్ ఐపీఎస్ భార్యను చంపింది

## నేపాలీ పని మనిషే..

### మరో ఇద్దరితో కలిసి హత్య
### బంగారం, డబ్బుల కోసమే ఘాతుకం



**వేద న్యూస్, క్రైం బ్యూరో**

హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య సునంద హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ఇంట్లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన పనిమనిషి కల్పన ప్రధాన నిందితురాలిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కల్పన మరో ఇద్దరితో కలిసి ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ హత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సునందను హత్య చేసిన అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదును బ్యాగుల్లో సర్దుకుని ముగ్గురు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇంట్లోని సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసు తీవ్ర సంచలనం రేపడంతో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ స్వయంగా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. హత్యకు గల పూర్తి కారణాలు, దోపిడీకి సంబంధించిన వివరాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశముందని పేర్కొన్నారు.

వేద న్యూస్



# ఘనంగా భాయ్ బాల్ముకుంద్ వర్ధంతి వేడుకలు

**- త్యాగాలను స్మరించిన మాజీ ఆర్మీ జవాన్ దంపతులు**



**వేద న్యూస్, మందమర్రి :**

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ విప్లవకారుడు భాయ్ బాల్ముకుంద్ వర్ధంతిని మందమర్రి పట్టణంలో మాజీ ఆర్మీ జవాన్ రాజేష్ పీవ్ హాల్, రాణి పీవ్ హాల్ దంపతులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తమ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. 1912లో ఢిల్లీలో లార్డ్ హార్డింగ్‌పై జరిగిన బాంబు దాడి కేసులో భాయ్ బాల్ముకుంద్ పాల్గొన్నట్లు బ్రిటీష్ ప్రభుత్వం ఆరోపించి, 1915 మే 8న అంబాలా సెంట్రల్ జైలులో ఉరి తీసిందని గుర్తుచేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం రాజు, రాజయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# డబ్బా గ్రామంలో ఉపాధి పనుల పరిశీలన

**- కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించిన ఎంపీడీవో**
**- కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ**



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో సీహెచ్ గణేష్ పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న పనులను సమగ్రంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య తక్కువగా ఉన్నందున మరింత పెంచాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. పనులను నాణ్యతతో నిర్వహించాలని సూచిస్తూ కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. కూలీలతో మాట్లాడి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులను సక్రమంగా నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధి హామీ మేట్ శ్రీరామ్, మహేష్, పంచాయతీ కార్యదర్శి రవళి పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

**- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు**



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు వేములవాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో తిప్పాపురం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ వేడుకల్లో కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, కౌన్సిలర్ ఏల శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తలసీమియా దినోత్సవం

**- బాధితులకు రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం- ఎంపీ కడియం కావ్య**




**వేద న్యూస్, హనుమకొండ:**

హనుమకొండ రెడ్ క్రాస్ భవన్‌లో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, అంతర్జాతీయ తలసీమియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసీమియా వార్డును సందర్శించిన ఎంపీ చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ... తలసీమియా, సికిల్ సెల్ బాధితులకు తరచూ రక్త మార్పిడి అవసరమవుతుందని, యువత పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. హనుమకొండ రెడ్ క్రాస్ రక్తకేంద్రం, తలసీమియా సేవలు రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# భార్య మందలించిందని వ్యక్తి ఆత్మహత్య

**- బావిలో దూకి ప్రాణాలు తీసుకున్న తాపీ కార్మికుడు**



**వేద న్యూస్, శాయంపేట :**

శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాక గ్రామానికి చెందిన కందగట్ల నరహరి (50) తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ నెల 6వ తేదీన భార్య కందగట్ల శారద మందలించడంతో రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. 07వ తేదీ ఉదయం గ్రామ శివారులోని నాగికుంట ఆయిల్ ఫామ్ తోట సమీపంలోని బావి వద్ద నరహరి టీవీఎస్ ఎక్సెల్ వాహనం కనిపించడంతో అనుమానం వ్యక్తమైంది. స్థానికుల సహాయంతో బావిలో గాలించగా నరహరి మృతదేహం బయటపడింది. భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# భీమేశ్వర సదన్ ఆవరణలో కూలిన చెట్టు




**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

భీమేశ్వర సదన్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వృక్షం అకస్మాత్తుగా కూలిపోయింది. భక్తులు, వాహనాలు ఉన్న వైపు కాకుండా మరో దిశలో చెట్టు పడటంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న దేవస్థానం అధికారులు వెంటనే స్పందించి కూలిన చెట్టును తొలగించే చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ప్రహరీ గోడకు స్వల్ప నష్టం జరిగినట్లు సమాచారం.

# కార్మికులందరూ లేబర్ కార్డు తీసుకోవాలి

**- ప్రభుత్వ పథకాల కోసం తప్పనిసరి**
**- భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పించిన అధికారులు**




**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల అవగాహన సదస్సులో జిల్లా లేబర్ ఆఫీసర్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా అందించే బీమా, ఆర్థిక సాయం తదితర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు లేబర్ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి హేయం

**- దాడుల సంస్కృతి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం**
**- బీఆర్ఎస్ యువజన నాయకుడు రాకేష్**



**వేద న్యూస్, శాయంపేట:**

కరీంనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలపై జరిగిన దాడిని బీఆర్ఎస్ యువజన జిల్లా నాయకుడు బెరుగు రాకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అనుచరులు గుండాల్లా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదని, భౌతిక దాడులతో ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కాలని చూడటం అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఎమ్మెల్యేల వ్యాఖ్యలపై అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో స్పందించాలే గానీ, దాడులకు పాల్పడటం సరైంది కాదన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేపడతాయని హెచ్చరించారు.

# శాయంపేట సీఐగా సుధాకర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ




**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట నూతన సీఐగా వై సుధాకర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ పి. రంజిత్ రావు సుల్తానాబాద్‌కు బదిలీ కావడంతో, కాజీపేట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వై సుధాకర్ రెడ్డిని శాయంపేట సీఐగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

వేద న్యూస్
శనివారం మే 09, 2026

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**- పేదింటి ఆడపిల్లలకు ఈ పథకాలు వరం - మంత్రి వివేక్ వెంకటస్వామి**




**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందమర్రి, ఖ్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాప్ రహిత గ్రామంగా కమలాపూర్

**- అక్రమ మద్యం విక్రయాలపై రూ.10 వేల జరిమానా**

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ గ్రామాన్ని బెల్ట్ షాప్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బెల్ట్ షాప్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి, మే 15లోపు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్ షాపుల నిషేధంపై ఇప్పటికే గ్రామపంచాయతీ తీర్మానం చేసినట్లు తెలిపారు. మే 15 తర్వాత ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే రూ.10 వేల జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్రమ బెల్ట్ షాపుల సమాచారం అందించిన వారికి రూ.2 వేల ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని వెల్లడించారు. గ్రామంలో బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ఎక్సైజ్ శాఖ, పోలీసులు, దుకాణ నిర్వాహకులు కూడా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పచ్చిమట్ల సదానందం అనే నిర్వాహకుడు తన బెల్ట్ షాపును స్వచ్ఛందంగా మూసివేస్తున్నట్లు లిఖితపూర్వకంగా గ్రామపంచాయతీకి తెలియజేయగా, సర్పంచ్, ఉపసర్పంచ్ మరియు పాలకవర్గ సభ్యులు ఆయనను అభినందించారు.

# రైతు బంధువు మేడిపల్లి సత్యం

**- ఎమ్మెల్యే చొరవతో రైతులకు ఊరట**
**- మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్**




**వేద న్యూస్, చొప్పదండి:**

రైతుల సమస్యలను దగ్గరుండి తెలుసుకుంటూ వారికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిజమైన రైతు బంధువని చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ అన్నారు. చొప్పదండి జువ్వాడి చొక్కారావు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల విజ్ఞప్తి మేరకు మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించడంలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారని తెలిపారు. కేంద్రం ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే దాదాపు 30 వేల క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేసి రాష్ట్రంలోనే రికార్డు సృష్టించిందన్నారు. మార్కెట్ యార్డు చరిత్రలో ఇంత పెద్ద స్థాయిలో మక్కల కొనుగోలు ఎప్పుడూ జరగలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన మూడు కొనుగోలు కేంద్రాల్లో ఒకటి చొప్పదండికి రావడం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవ వల్లేనని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని కొత్తూరి మహేష్ కొనియాడారు.

# డీజీపీని కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**వేద న్యూస్, చొప్పదండి:**




తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ను చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో పశు ఆరోగ్య శిబిరం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**



ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కల్లెడ గంగాధర్ మాట్లాడుతూ.. పాడి రైతులు పశువైద్య సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ వేసవిలో ఎండలు అధికంగా ఉన్నందున పశువులను ఉదయం వేళల్లోనే మేతకు తీసుకెళ్లాలని సూచించారు. వడదెబ్బ నుంచి పశువులను రక్షించేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి ఆరు నెలలకు ఒకసారి గాలి టీకాలు వేయించాలని, కృత్రిమ గర్భధారణలో సెక్స్ సీమన్ వినియోగంతో ఆడ దూడలు జన్మించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెడ్డు రాజారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మనోజ్, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బంగారు వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి

**- అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం ఇవ్వాలి**
**- ఏసీపీ కిరణ్‌కుమార్**
**- గోల్డ్ షాపులు, లాడ్జిల యజమానులతో సమావేశం**




**వేద న్యూస్, మందమర్రి:**

బంగారు ఆభరణాల వ్యాపారులు, గోల్డ్ లోన్ సంస్థల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మందమర్రిలోని ఇల్లందు క్లబ్‌లో బ్యాంకులు, గోల్డ్ ఫైనాన్స్ సంస్థలు, గోల్డ్ షాపులు, లాడ్జిల యజమానులతో పోలీసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులకు లాడ్జిల్లో గదులు ఇచ్చే ముందు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు పరిశీలించాలని సూచించారు. ఇటీవల దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో గోల్డ్ షాపులు, గోల్డ్ లోన్ సంస్థలు ఆధునిక సీసీ కెమెరాలు, ఫైర్ సైరన్‌లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నేరాలు జరిగిన తర్వాత ఫిర్యాదు చేయడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్, మందమర్రి సీఐ పర్స రమేష్, ఎస్ఐలు, బ్యాంకు మేనేజర్లు, గోల్డ్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

# పురుగుమందుల అధిక వినియోగం వల్ల కాలుష్యం

**- రసాయన మందులు సిఫారసు మేరకే వాడాలి**
**- శాస్త్రవేత్త స్వాతి**
**- రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో అవగాహన**



**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త స్వాతి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విచక్షణారహితంగా పురుగుమందులు పిచికారీ చేయడం వల్ల నీరు, నేల, గాలి కాలుష్యానికి గురవుతాయని తెలిపారు. మిత్ర పురుగులు నశించడంతో పాటు పంటల్లో రసాయన అవశేషాలు మిగిలి మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. రైతులు రసాయన మందులను సిఫారసు మేరకే వాడాలని సూచించారు. డివిజన్ ఏడీఏ ప్రియదర్శిని, ఉద్యానవన అధికారి రోహిత్ పంట తెగుళ్ల యాజమాన్యం, జీవ ఎరువుల వినియోగం, పచ్చిరొట్టె ఎరువుల పెంపకం గురించి వివరించారు. మే 31లోపు రైతు నమోదు చేసుకున్న వారికే సబ్సిడీ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మమత, రైతులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ధర్నా, రాస్తారోకో

**- బీజేపీ, కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ నేతలు**
**- పాడి కౌశిక్ రెడ్డిపై దాడి యత్నానికి ఖండన**



**వేద న్యూస్, వేములవాడ రూరల్ :**

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై జరిగిన దాడి యత్నాన్ని ఖండిస్తూ వేములవాడలో బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ఆందోళన చేపట్టాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపుమేరకు తెలంగాణ చౌక్‌లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల గుండాయిజం పెరిగిపోతుందని ఆరోపించారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడి చేయడానికి బీజేపీ శ్రేణులు ప్రయత్నించాయని విమర్శించారు. అనంతరం తెలంగాణ చౌక్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తూ బీజేపీ గుండాలారా ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఎమ్మెల్యేలకే రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ భౌతిక దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించిన నేతలు, అభివృద్ధిపై రాజకీయ చర్చలు జరగాలే తప్ప దాడుల రాజకీయాలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనం, క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడికి బాధ్యులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

- దాడులను ఖండిస్తూ బీఆర్ఎస్ ఆందోళన
- రాస్తారోకాతో ఉద్రిక్తంగా మారిన రామడుగు



**వేద న్యూస్, రామడుగు :**

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని నిరసిస్తూ రామడుగు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ఆందోళన చేపట్టాయి. మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కార్యకర్తలు బస్టాండ్ వద్ద రాస్తారోకా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దగ్ధం చేయడానికి బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు మంటలను ఆర్పి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అంతకుముందు వైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంట్ల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విధ్వంసక రాజకీయాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. దాడులకు భయపడేది లేదని, అవసరమైతే తిప్పికొట్టే శక్తి బీఆర్ఎస్‌కు ఉందని హెచ్చరించారు.

# కోట మైసమ్మ ఆలయ షాపుల వేలం



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలోని శ్రీ కోట మైసమ్మ తల్లి దేవాలయానికి చెందిన షాపుల వేలం పాట శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ ఆదాయ వనరులను పెంపొందించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎండోమెంట్ శాఖ ఈఓ వేణు గోపాలాచారి పర్యవేక్షణలో నిర్వహించిన వేలంలో 1 నుంచి 7 వరకు ఉన్న షాపులను వేలానికి ఉంచగా, తక్కువ సంఖ్యలో వేలం దారులు హాజరుకావడంతో ప్రస్తుతం 3, 4, 5 నంబర్ షాపులకు మాత్రమే వేలం పూర్తయింది. మిగిలిన షాపులకు త్వరలో మళ్లీ వేలం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వేలం నిబంధనల ప్రకారం ప్రతి షాపుకు రూ.15 వేల డిపాజిట్, నెలకు రూ.2,915 అద్దె, సంవత్సరానికి రూ.34,980 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆలయ పరిసరాల్లో మద్యం, మాంసం విక్రయాలకు పూర్తిగా నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. 3వ నంబర్ షాప్‌ను ధర్మం నాగేశ్వరరావు, 4వ నంబర్ షాప్‌ను బోడ జ్యోతి, 5వ నంబర్ షాప్‌ను గుగులోత్ నవీన్ దక్కించుకున్నారు. కాగా 2వ నంబర్ షాప్‌కు సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడంతో ఆ షాప్‌ను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సా పట్టాభిరామారావు, లలిత, సాయి, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వర్షకొండలో హిందూ సమ్మేళన బైక్ ర్యాలీ

- కాషాయ జెండాలతో యువత సందడి
- జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన గ్రామం



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. హిందూ సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక కూరగాయల మార్కెట్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో పాల్గొన్న వారు మెడలో కాషాయ కండువాలు ధరించి, చేతుల్లో కాషాయ జెండాలతో ప్రధాన వీధుల్లో ఊరేగారు. "జై శ్రీరామ్" నినాదాలతో గ్రామం మార్మోగింది. గ్రామంలో మునుపెన్నడూ లేనివిధంగా కాషాయ వాతావరణం నెలకొనగా, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో వర్షకొండ గ్రామం సందడిగా మారింది.

# మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

- ఈ నెల 20న భారీ ఉపాధి మేళా
- యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యం
- కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా పోస్టర్ విడుదల



**వేద న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లాలో ఈ నెల 20న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు ఈ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అర్హతలకు తగిన ఉద్యోగాలను పొందాలని సూచించారు. ప్రైవేట్ రంగంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు ముందుగానే తమ బయోడేటా, సర్టిఫికెట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు చేపట్టనున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మత్స్యశాఖ అధికారి లాయక్ మొహియుద్దీన్, సంక్షేమ శాఖ అధికారి మిల్కా, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత ఉపయోగపడతాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన చైర్మన్

- సల్కునూరులో నివాళులు అర్పించిన గడ్డం స్పృధర్ రెడ్డి



**వేద న్యూస్, నల్లగొండ :**

వేములపల్లి మండలంలోని సల్కునూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నర్సింగోజు కృష్ణయ్య, జెర్రిపోతుల రాములమ్మ, అంకెపాక చంద్రయ్య కుటుంబాలను సల్కునూరు సహకార సంఘం చైర్మన్ గడ్డం స్పృధర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పల్ల భిక్షం, బ్యాంక్ సీఈఓ వాకిటి నరేష్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

- ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లింపు



**వేద న్యూస్, కారేపల్లి:**

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శుక్రవారం విజయవాడలోని కనకదుర్గ ఆలయం ను దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై వెలసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతి ఏటా కనకదుర్గమ్మను దర్శించుకోవడం తన ఆనవాయితీ అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు రావాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మాలోత్ విగ్నేష్ నాయక్‌తో పాటు బానోత్ రామ్మూర్తి నాయక్, ఉపేందర్, జయరాజ్, రాజేష్, వినోద్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌తో మహిళ మృతి

- ఉసిరికాయలపల్లిలో విషాదం
- రెండు రోజుల చికిత్స అనంతరం కన్నుమూత



**వేద న్యూస్, కారేపల్లి :**

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోడ శాంతి తీవ్ర బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. బోడ శాంతి నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా కిందపడిపోయింది. వెంటనే ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు తీవ్ర స్థాయి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు నిర్ధారించారు. రెండు రోజుల పాటు ప్రత్యేక చికిత్స అందించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆమె నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామ ప్రజలు ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పోస్టల్ ఐపీ అధికారి

**వేద న్యూస్ వనపర్తి :**

వనపర్తి జిల్లాలో సీబీఐ అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులు కలకలం రేపాయి. పోస్టల్ శాఖలో ఐపీ అధికారిగా పనిచేస్తున్న గోపీనాథ్‌ను లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. సీబీఐకి అందిన ఫిర్యాదు ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికతో వల పన్ని ఈ ఆపరేషన్ నిర్వహించినట్టు సమాచారం. పోస్టల్ శాఖలో పలు అభివృద్ధి పనులు, బిల్లుల క్లియరెన్స్, పరిపాలనా అనుమతుల కోసం గోపీనాథ్ లంచం డిమాండ్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. బాధితుడు ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో లక్షల రూపాయల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగినట్టు సీబీఐ అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. పోస్టల్ శాఖకు సంబంధించిన కొన్ని పథకాల నిధులను అక్రమంగా మళ్లించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గోపీనాథ్ కార్యాలయం, నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు కీలక పత్రాలు, లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో పోస్టల్ శాఖలో తీవ్ర కలకలం రేగింది. ప్రభుత్వ నిధుల వినియోగం, బిల్లుల ఆమోద ప్రక్రియల్లో మరిన్ని అవకతవకలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గోపీనాథ్‌తో పాటు మరెవరైనా ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నారా అనే కోణంలో కూడా సీబీఐ దర్యాప్తు కొనసాగిస్తోంది

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి వినతి



**వేద న్యూస్ హైదరాబాద్ :**

కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలాన్ని కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ కళాశాల ప్రతినిధులు బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బండి రాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీధర్ పాల్గొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో కేటాయించిన స్థలంలో డిగ్రీ కళాశాల నిర్మాణ పనులు చేపట్టాలని వారు కోరారు. ప్రస్తుతం సూరారంలోని తాత్కాలిక కళాశాల ప్రాంగణంలో తాగునీటి సదుపాయం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డిగ్రీ కళాశాలతో పాటు ఇంటర్మీడియట్, ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో సూరారంలో జూనియర్, ఒకేషనల్ జూనియర్ కళాశాలలతో పాటు తాత్కాలిక డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో హెచ్ఎంటి కంపెనీ స్థలంలో నాలుగు ఎకరాలు డిగ్రీ కళాశాల కోసం కేటాయించినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం మారడంతో స్థల కేటాయింపు ప్రక్రియ కొంత ఆలస్యమైందని పేర్కొన్నారు. త్వరలోనే సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి డిగ్రీ కళాశాల స్థల కేటాయింపు, నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సూరారం ప్రభుత్వ కళాశాలల సముదాయంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు కోసం కూడా కృషి చేస్తామని తెలిపారు.

# పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్



**వేద న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం :**

సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో భాగంగా ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ విభాగాలు, మందుల గది, సిబ్బంది హాజరు నమోదు పత్రాలు, ఔట్‌పేషెంట్ రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. రోజువారీగా ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, నమోదవుతున్న కేసులు, అందిస్తున్న వైద్య సేవల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ సేవలు, ల్యాబ్ పరిస్థితి, పరీక్షల ఫలితాల అందజేత విధానంపై ఆరా తీశారు. మందుల నిల్వ గదిని పరిశీలించి అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. స్టాక్ రికార్డుల నిర్వహణను కూడా పరిశీలించారు.ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో భారతి, మెడికల్ అధికారి డాక్టర్ రమేష్, నర్సింగ్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం రవాణాలో ఆలస్యం కాకూడదు

- ఓపీఎంఎస్ నమోదు వెంటనే పూర్తి చేయాలి
- రెండు రోజుల్లో కేంద్రాల్లోని ధాన్యం తరలింపు
- కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష



**వేద న్యూస్ జనగామ :**

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను సకాలంలో కొనుగోలు చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, ఓపీఎంఎస్ నమోదు, రవాణా అంశాలపై శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఎంలు, సీసీలు, కేంద్ర నిర్వాహకులతో కలిసి కొనుగోలు ప్రక్రియ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. కేంద్రాల వారీగా ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోళ్లు, గన్నీ బ్యాగుల సరఫరా, లారీల కేటాయింపు, ఓపీఎంఎస్ నమోదులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకునేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రత్యేకంగా వాహనాలు కేటాయించినట్లు తెలిపారు. ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యం జరిగినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రాలకు కేటాయించిన లారీలు సమయానికి రాకపోతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రవాణా విషయంలో నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏపీఎంలు, సీసీలు, కేంద్ర నిర్వాహకులు సమన్వయంతో పని చేస్తే 15 రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. మిల్లర్లు కొనుగోళ్ల ధృవీకరణను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో రైతుల ఖాతాల్లో డబ్బులు సకాలంలో జమ అవుతాయని తెలిపారు. మిల్లులకు వెళ్లే ప్రతి వాహనంతో కేంద్ర నిర్వాహకుల్లో ఒకరు తప్పనిసరిగా వెళ్లాలని సూచించారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్షాలోం, జడ్పీ సీఈఓ, ఇంచార్జ్ డీఆర్డీఓ రంగారావు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, పౌరసరఫరాల డీఎం హతిరామ్, అదనపు డీఆర్డీఓ నూరుద్దీన్, పీఏసీఎస్ సీఈఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పిప్పళ్లతో ఆరోగ్యానికి సహజ రక్షణ



- శ్వాసకోశ సమస్యలకు ఆయుర్వేద పరిష్కారం
- జీర్ణక్రియను మెరుగుపరచే ఔషధ గుణాలు
- మితంగా వాడితేనే పూర్తి ప్రయోజనం

**వేద న్యూస్ డెస్క్:**

భారతీయ సాంప్రదాయ వైద్యంలో పిప్పళ్లకు ప్రత్యేక స్థానం ఉంది. చిన్నగా కనిపించే ఈ ఔషధ దినుసులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం, చలికాలంలో వచ్చే జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి రక్షణ పొందేందుకు పిప్పళ్లు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొంటున్నారు. శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడంలో పిప్పళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. దీర్ఘకాలిక దగ్గు, జలుబు, ఆస్తమా వంటి సమస్యలతో బాధపడేవారికి ఇవి మేలు చేస్తాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. పిప్పళ్ల పొడిని తేనెతో కలిపి తీసుకుంటే ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన కఫం తగ్గే అవకాశం ఉందని సూచిస్తున్నారు. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా పిప్పళ్లు ఉపయోగపడుతున్నాయి. అజీర్తి, కడుపు ఉబ్బరం, ఆకలి లేకపోవడం వంటి సమస్యలను తగ్గించడంలో ఇవి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలోని జీవక్రియ వేగాన్ని పెంచి, అదనపు కొవ్వు కరిగించడంలో కూడా పిప్పళ్లు దోహదపడుతున్నాయని వివరిస్తున్నారు. మధుమేహం నియంత్రణలో కూడా పిప్పళ్లకు ప్రాధాన్యం పెరుగుతోంది. రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడంలో ఇవి కొంతవరకు సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా పిప్పళ్లలోని యాంటీ ఆక్సిడెంట్లు ఉపయోగపడుతున్నాయని చెబుతున్నారు. రోగనిరోధక శక్తిని పెంచడంలో పిప్పళ్లు మేలు చేస్తాయని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో ఇవి సహాయపడతాయని పేర్కొంటున్నారు. బరువు తగ్గాలనుకునే వారు కూడా మితంగా పిప్పళ్లు తీసుకుంటే ప్రయోజనం పొందవచ్చని చెబుతున్నారు. అయితే పిప్పళ్లను అతిగా తీసుకోవడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇవి వేడి స్వభావం కలిగి ఉండటంతో గర్భిణీలు, శరీరంలో వేడి ఎక్కువగా ఉండేవారు వైద్యుల సలహాతో మాత్రమే వాడాలని సూచిస్తున్నారు. సరైన మోతాదులో తీసుకుంటే పిప్పళ్లు ఆరోగ్యానికి సహజ వరంగా మారుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

# ఏసీ గదిలో ముప్పు తప్పదు



- నీరు తక్కువగా తాగితే డీహైడ్రేషన్ ప్రమాదం
- గంటల తరబడి ఏసీలో ఉంటే ఆరోగ్య సమస్యలు
- ఐటీ ఉద్యోగులు ఎక్కువగా జాగ్రత్తలు పాటించాలి

**వేద న్యూస్ డెస్క్:**

సాధారణంగా ఎండలో తిరిగేవారికే డీహైడ్రేషన్ సమస్య వస్తుందని చాలామంది భావిస్తుంటారు. కానీ చల్లని ఏసీ గదుల్లో గంటల తరబడి పనిచేసే ఉద్యోగుల్లో కూడా ఈ సమస్య తీవ్రంగా పెరుగుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాల్లో పనిచేసేవారు ఎక్కువసేపు ఏసీలో ఉండటం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుందని చెబుతున్నారు. ఏసీ గదుల్లో చల్లదనం ఉండటంతో దాహం ఎక్కువగా అనిపించదు. దీంతో చాలా మంది తగినంత నీరు తాగకుండా రోజంతా గడుపుతున్నారు. శరీరానికి అవసరమైన ద్రవాలు తగ్గిపోవడంతో అలసట, తలనొప్పి, నోరు ఎండిపోవడం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇంకా కొందరిలో చర్మం పొడిబారడం, కళ్లలో మంట, శ్వాస సంబంధిత ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. ఏసీ గదుల్లో గాలి తేమ తగ్గిపోవడం వల్ల ఈ సమస్యలు మరింత పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు తాగాలని సూచిస్తున్నారు. ప్రతి గంటకు ఒకసారి లేచి కొద్దిసేపు నడవడం, నీరు తాగడం ఆరోగ్యానికి మంచిదని వైద్యులు అంటున్నారు. కొబ్బరి నీరు, పండ్ల రసాలు, మజ్జిగ వంటి ద్రవాలు తీసుకోవడం వల్ల శరీరంలో నీటి సమతుల్యత నిలుస్తుందని చెబుతున్నారు. ఏసీ ఉష్ణోగ్రతను చాలా తక్కువగా పెట్టకుండా 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉంచాలని సూచిస్తున్నారు. గదుల్లో కొంతసేపు సహజ గాలి వచ్చేలా చూడటం కూడా అవసరమని చెబుతున్నారు. ముఖ్యంగా రోజంతా కంప్యూటర్ల ముందు కూర్చునే ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# క్యారెట్‌తో ఆరోగ్యానికి కాంతి



**వేద న్యూస్ డెస్క్:**

రోజువారీ ఆహారంలో క్యారెట్‌ను చేర్చుకోవడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. విటమిన్-ఎ, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే ఈ కూరగాయ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ క్యారెట్ మంచి ఆహారంగా భావిస్తున్నారు. క్యారెట్‌లో ఉండే బీటా కెరోటిన్ కంటి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్యులు వివరిస్తున్నారు. దీన్ని శరీరం విటమిన్-ఎగా మార్చుకుంటుంది. దీని వల్ల చూపు మెరుగుపడటంతో పాటు రాత్రివేళల్లో చూపు మందగించే సమస్యలు తగ్గే అవకాశముందని చెబుతున్నారు. కంప్యూటర్, మొబైల్ ఎక్కువగా ఉపయోగించే వారికి క్యారెట్ ఉపయోగకరంగా ఉంటుందని సూచిస్తున్నారు. జీర్ణక్రియను సక్రమంగా ఉంచడంలో కూడా క్యారెట్ కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధక సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. కడుపు శుభ్రంగా ఉండటానికి ఇది దోహదపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉదయం సమయంలో క్యారెట్ ముక్కలు లేదా క్యారెట్ రసం తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా క్యారెట్ మంచి ఫలితాలు ఇస్తోంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా ఉంచడంలో సహాయపడుతున్నాయి. వేసవిలో శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు క్యారెట్ ఉపకరిస్తుందని చెబుతున్నారు. ముఖంపై అలసట, పొడిబారిన చర్మం తగ్గేందుకు ఇది ఉపయోగపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గుండె ఆరోగ్యానికి కూడా క్యారెట్ మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో ఇది సహాయపడుతుందని వివరిస్తున్నారు. రక్తపోటు నియంత్రణకు కూడా క్యారెట్ ఉపయోగకరంగా ఉండొచ్చని అంటున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా క్యారెట్‌ను తరచుగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే క్యారెట్‌ను మితంగా తీసుకోవడమే మంచిదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధికంగా తీసుకుంటే కొన్ని సందర్భాల్లో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. పరిశుభ్రంగా కడిగి తీసుకోవడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను మరింతగా పొందవచ్చని సూచిస్తున్నారు.

# మారుతి కార్లపై భారీ ఆఫర్లు.. రూ.2 లక్షలకుపైగా రాయితీలు

**వేద న్యూస్ డెస్క్:**



దేశీయ కార్ల తయారీ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న మారుతి సుజుకీ ఈ నెలలో వినియోగదారులకు భారీ శుభవార్త అందించింది. అమ్మకాలను పెంచడం, కొత్త కొనుగోలుదారులను ఆకర్షించడం లక్ష్యంగా పలు మోడళ్లపై ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. కొన్ని వాహనాలపై రూ.2 లక్షలకు పైగా డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ ప్రకటించిన ఆఫర్ల ప్రకారం ఫ్రాంక్స్ మోడల్‌పై రూ.25 వేల వరకు, సెలేరియోపై రూ.27,500, ఈకో స్టార్‌పై రూ.37,500, ఎస్-ప్రెస్సోపై రూ.37,500 వరకు రాయితీలు లభించనున్నాయి. అలాగే సియాజ్, బాలెనో మోడళ్లపై రూ.40 వేల వరకు తగ్గింపు అందిస్తున్నారు. స్విఫ్ట్ సీఎన్‌జీ, జిమ్నీ మోడళ్లపై రూ.45 వేల వరకు, ఇగ్నిస్ బ్లాక్ ఎడిషన్‌పై రూ.50 వేల వరకు ప్రత్యేక ఆఫర్ ప్రకటించారు. ఆల్టో కే10, వ్యాగన్ ఆర్ మోడళ్లపై రూ.52,500 వరకు డిస్కౌంట్ లభించనుంది. బ్రెజ్జాపై రూ.55 వేల వరకు, విక్టోరియా మోడల్‌పై రూ.70 వేల వరకు తగ్గింపు అందిస్తున్నారు. ఇక అత్యధిక రాయితీలు గ్రాండ్ విటారా, ఇన్విక్టో మోడళ్లపై ప్రకటించారు. గ్రాండ్ విటారాపై రూ.1.08 లక్షల వరకు, ఇన్విక్టోపై రూ.2.15 లక్షల వరకు ప్రత్యేక డిస్కౌంట్లు లభించనున్నాయి. పెరుగుతున్న పోటీ నేపథ్యంలో వినియోగదారులను ఆకట్టుకునేందుకు మారుతి సుజుకీ ఈ భారీ ఆఫర్లను తీసుకొచ్చినట్లు ఆటోమొబైల్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ఆఫర్లు నగరం, డీలర్‌షిప్, స్టాక్ లభ్యత ఆధారంగా మారే అవకాశం ఉందని కంపెనీ పేర్కొంది.


# హరిత భారత్‌కు యాపిల్ భారీ పెట్టుబడి.. 1.5 లక్షల ఇళ్లకు స్వచ్ఛ విద్యుత్



**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచ టెక్నాలజీ దిగ్గజం యాపిల్ భారత్‌లో పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీ పెట్టుబడిని ప్రకటించింది. దేశంలో హరిత ఇంధన మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.100 కోట్ల ప్రారంభ పెట్టుబడిని పెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రాజెక్ట్‌ను పునరుత్పాదక ఇంధన సంస్థ క్లీన్‌మ్యాక్స్ భాగస్వామ్యంతో అమలు చేస్తున్నారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా 150 మెగావాట్లకు పైగా కొత్త పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఏర్పడనుంది. ఈ విద్యుత్ ఉత్పత్తితో సుమారు 1.5 లక్షల భారతీయ గృహాల వార్షిక విద్యుత్ అవసరాలను తీర్చవచ్చని అంచనా వేస్తున్నారు. పర్యావరణ రంగంలో పనిచేస్తున్న ఆరు స్టార్టప్‌లకు కూడా యాపిల్ ఆర్థిక సహాయం, సాంకేతిక మద్దతు అందించనుంది. వ్యర్థాల నిర్వహణ, వలయాకార ఆర్థిక వ్యవస్థ, సుస్థిర జీవన విధానాలపై పనిచేస్తున్న సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే భారత్‌లోని తన కార్యాలయాలు, రిటైల్ స్టోర్లను పూర్తిగా స్వచ్ఛమైన ఇంధనంతో నడిపించేందుకు యాపిల్ రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను అమలు చేస్తోంది. అలాగే పర్యావరణ రంగంలో పనిచేస్తున్న సంస్థలకు మార్గదర్శకత్వం అందించేందుకు అక్యుమెన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. యాపిల్ ప్రతినిధి సారా చాండ్లర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ సంస్థ ఆవిష్కరణలకు ప్రధాన ప్రేరణగా నిలుస్తోందని తెలిపారు. 2030 నాటికి సంస్థ కార్యకలాపాలన్నింటినీ కార్బన్ తటస్థ స్థితికి తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ భాగస్వామ్యంతో భారత్‌లో తయారీ విస్తరణను కూడా యాపిల్ వేగవంతం చేస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాల తగ్గింపు, రీసైక్లింగ్ వ్యవస్థల బలోపేతంపై కూడా సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. గోవాలో విజయవంతంగా అమలు చేసిన వ్యర్థాల నిర్వహణ నమూనాను ఇప్పుడు కోయంబత్తూరు వంటి ప్రాంతాలకు విస్తరిస్తున్నారు. రైతులకు నిల్వ సదుపాయాలు, ఎలక్ట్రిక్ వాహనాల అభివృద్ధి, మహిళలకు ఈవీ డ్రైవింగ్ శిక్షణ వంటి సామాజిక కార్యక్రమాలకు కూడా యాపిల్ మద్దతు అందిస్తోంది. యాపిల్ విడుదల చేసిన తాజా పర్యావరణ నివేదిక ప్రకారం 2015 తర్వాత సంస్థ ఆదాయం 78 శాతం పెరిగినా, ప్రపంచవ్యాప్తంగా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను 60 శాతానికి పైగా తగ్గించడం విశేషంగా మారింది.

# స్మార్ట్‌ఫోన్ ధరలకు బ్రేక్.. క్వాల్‌కామ్ కొత్త చిప్‌సెట్లు





**వేద న్యూస్ డెస్క్:**

టెక్నాలజీ రంగ దిగ్గజం క్వాల్‌కామ్ మధ్యశ్రేణి, తక్కువ ధర స్మార్ట్‌ఫోన్ల కోసం కొత్త తరం చిప్‌సెట్లను విడుదల చేసింది. ఇటీవల స్మార్ట్‌ఫోన్ల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ కొత్త చిప్‌లు మార్కెట్‌లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. క్వాల్‌కామ్ విడుదల చేసిన స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 5, స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 5 చిప్‌సెట్లు మెరుగైన పనితీరు, ఎక్కువ బ్యాటరీ సామర్థ్యం, అధునాతన కనెక్టివిటీ సదుపాయాలను అందిస్తాయని సంస్థ తెలిపింది. ఈ చిప్‌సెట్ల ద్వారా అందుబాటు ధరల్లోనే కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకునే స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే అవకాశం ఉంటుందని కంపెనీ వెల్లడించింది. క్వాల్‌కామ్ టెక్నాలజీస్ సీనియర్ ఉపాధ్యక్షుడు క్రిస్ పాట్రిక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం చిప్‌ల సరఫరా పరిమితమవడం, పరికరాల తయారీ ఖర్చులు పెరగడం వల్ల మొబైల్ ధరలు అధికమవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో అధునాతన ఫీచర్లు అందించే చిప్‌సెట్లను రూపొందించినట్లు పేర్కొన్నారు. కొత్త చిప్‌సెట్లతో కెమెరా నాణ్యత, గేమింగ్ అనుభవం, పనితీరు మరింత మెరుగవుతాయని కంపెనీ వెల్లడించింది. ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారిత ఫీచర్లను మధ్యశ్రేణి ఫోన్లలో కూడా అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ చిప్‌లను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. ఇప్పటికే ఒప్పో, రియల్‌మీ, షియామీ వంటి ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలతో క్వాల్‌కామ్ ఒప్పందాలు కుదుర్చుకుంది. దీంతో త్వరలో విడుదలయ్యే కొత్త మోడళ్ల ధరలు కొంత మేర తగ్గే అవకాశముందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఆర్సీబీ మ్యాచ్‌కు హార్దిక్ సిద్ధం..

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్ 2026లో పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటున్న ముంబై ఇండియన్స్‌కు కీలక మ్యాచ్‌కు ముందు ఊరట లభించింది. జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్య గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టుతో చేరాడు. మే 10న రాయ్‌పూర్ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే మ్యాచ్‌కు కూడా హార్దిక్ దూరమవుతాడన్న ప్రచారానికి దీంతో తెరపడింది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన గత మ్యాచ్‌కు వెన్నునొప్పి కారణంగా హార్దిక్ దూరమైన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ శర్మ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆ మ్యాచ్‌లో ముంబై విజయం సాధించడంతో సూర్యనే కెప్టెన్‌గా కొనసాగించాలని అభిమానుల నుంచి డిమాండ్లు వినిపించాయి. ఈ నేపథ్యంలో హార్దిక్ భవిష్యత్తుపై కూడా చర్చ జరిగింది. అయితే తాజాగా హార్దిక్ రాయ్‌పూర్ చేరుకుని జట్టుతో కలవడంతో అన్ని ఊహాగానాలకు చెక్ పడింది. ఈ విషయాన్ని ముంబై ఇండియన్స్ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా వెల్లడించింది. బెంగళూరుతో జరిగే కీలక పోరులో అతడు బరిలోకి దిగే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడి కేవలం మూడు విజయాలే నమోదు చేసింది. 6 పాయింట్లతో పట్టికలో 9వ స్థానంలో కొనసాగుతోంది. ప్లే ఆఫ్స్ ఆశలు నిలుపుకోవాలంటే ఇక మిగిలిన ప్రతి మ్యాచ్‌లోనూ గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ఇతర జట్ల ఫలితాలపై కూడా ముంబై ఆధారపడాల్సి ఉంటుంది.

# టీ20 జట్టులో మార్పుల సూచనలు..

## - సూర్య స్థానంలో శ్రేయాస్‌కు కెప్టెన్సీ?

**వేద న్యూస్ డెస్క్:**



టీమిండియా టీ20 జట్టులో భారీ మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించి, ఆ స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌కు అవకాశం ఇవ్వాలని బీసీసీఐ వర్గాలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ త్వరలో కొత్త కెప్టెన్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఈ ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను సమర్థంగా నడిపిస్తున్న శ్రేయాస్ అయ్యర్ నాయకత్వంపై సెలెక్టర్లు సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున 10 మ్యాచ్‌లు ఆడిన ఆయన కేవలం 195 పరుగులు మాత్రమే చేశారు. దీంతో జట్టులో ఆయన స్థానం పైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సూర్యకుమార్ చేతిమడిమ సమస్యతో బాధపడుతున్నప్పటికీ నొప్పితోనే ఆడుతున్నట్లు కొన్ని నివేదికలు వెల్లడించాయి. మరోవైపు శ్రేయాస్ అయ్యర్ మాత్రం అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఈ సీజన్‌లో 9 మ్యాచ్‌ల్లో 333 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కెప్టెన్సీలో కూడా కొత్త మార్పులు తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సూర్యకుమార్ కెప్టెన్‌గా ఇప్పటివరకు ఒక్క టీ20 సిరీస్ కూడా ఓడిపోలేదు. 2026 టీ20 ప్రపంచకప్ విజయంతో ఆయన నాయకత్వానికి మంచి గుర్తింపు లభించింది. మరోవైపు శ్రేయాస్ అయ్యర్ గత రెండేళ్లుగా భారత టీ20 జట్టుకు దూరంగా ఉన్నాడు. 2023 డిసెంబర్‌లో చివరిసారి టీమిండియా తరఫున టీ20 మ్యాచ్ ఆడాడు. ఇప్పటికే ఈ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, బీసీసీఐ అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వైభవ్‌పై ఇంగ్లండ్ దిగ్గజాల ప్రశంసల జల్లు

**వేద న్యూస్ డెస్క్:**




టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరుస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అరుదైన రికార్డులు సృష్టిస్తూ ఐపీఎల్‌లో బౌలర్లకు భయంకరంగా మారాడు. తాజాగా ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు కూడా వైభవ్ ఆటపై ప్రశంసల వర్షం కురిపించడం విశేషంగా మారింది. 'స్టిక్ టు క్రికెట్' అనే కార్యక్రమంలో పాల్గొన్న ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ ఫిల్ టఫ్నెల్ మాట్లాడుతూ.. వైభవ్ ఇదే ఫామ్ కొనసాగిస్తే 21 ఏళ్లకే అన్ని రికార్డులు సాధించి, భారీగా సంపాదించి రిటైర్ అయ్యే స్థాయికి చేరుకుంటాడని సరదాగా వ్యాఖ్యానించాడు. అతడి దూకుడు బ్యాటింగ్ చూస్తుంటే ప్రపంచ స్థాయి బౌలర్లకే భయం వేసేలా ఉందని చెప్పాడు. ఇక భారత ఆటగాళ్లపై తరచూ విమర్శలు చేసే మైఖేల్ వాన్ కూడా వైభవ్‌ను కొనియాడటం ఆసక్తికరంగా మారింది. క్రిస్ గేల్ లాంటి విధ్వంసకర ఆటగాడు కెరీర్ మధ్యలో 30 బంతుల్లో సెంచరీ చేస్తే.. వైభవ్ మాత్రం చిన్న వయసులోనే 35 బంతుల్లో శతకం బాదాడని ప్రశంసించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటికే 37 సిక్సర్లు కొట్టి బౌలర్లపై ఆధిపత్యం చాటుతున్నాడని పేర్కొన్నాడు. మరో మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ కూడా వైభవ్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ సిక్సర్ల హిట్టర్‌గా అభివర్ణించాడు. డేవిడ్ లాయిడ్ సహా పలువురు మాజీ ఆటగాళ్లు కూడా వైభవ్ ప్రతిభను కొనియాడారు. మొత్తంగా ఇంగ్లండ్ దిగ్గజాలంతా ఒకే వేదికపై భారత యువ ఆటగాడిని ప్రశంసించడం ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.

# టీ20లో బౌలర్లకు న్యాయం చేయాలి: గావస్కర్

**వేద న్యూస్ డెస్క్:**



టీ20 క్రికెట్‌లో బ్యాటర్ల ఆధిపత్యం రోజురోజుకీ పెరుగుతుండటంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 20 ఓవర్ల ఫార్మాట్ పూర్తిగా బ్యాటర్లకు అనుకూలంగా మారిపోయిందని, బౌలర్ల పరిస్థితి దయనీయంగా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఐసీసీ నిబంధనల్లో మార్పులు అవసరమని సూచిస్తూ, ఐసీసీ క్రికెట్ కమిటీ ఛైర్మన్ సౌరవ్ గంగూలీకి కీలక విజ్ఞప్తి చేశారు. చిన్న బౌండరీలు, పవర్‌ఫుల్ బ్యాట్లు, ఫీల్డింగ్ పరిమితులు వంటి కారణాలతో బ్యాటర్లు భారీ స్కోర్లు సులభంగా సాధిస్తున్నారని గావస్కర్ పేర్కొన్నారు. బౌలర్లు ఎంత వ్యూహాలు రచించినా వారిని నియంత్రించడం కష్టమవుతోందని అన్నారు. ఇటీవల టీ20ల్లో 250కు పైగా స్కోర్లు సాధారణమైపోవడం కూడా దీనికే నిదర్శనమని చెప్పారు. ముఖ్యంగా బౌన్సర్ వైడ్ నిబంధనపై గావస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాటర్ తలకు కొద్దిగా ఎత్తులో వెళ్లిన బంతిని కూడా వైడ్‌గా ప్రకటించడం వల్ల పేసర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. "బ్యాటర్‌కు ఇలాంటి షాట్ ఆడొద్దని చెప్పలేం. అయితే బౌలర్లకు మాత్రం ఎందుకు ఇన్ని ఆంక్షలు?" అని ప్రశ్నించారు. బ్యాటర్ సాధారణ స్టాన్స్ కంటే ఒక అడుగు ఎత్తులో వెళ్లే బంతిని వైడ్‌గా పరిగణించకుండా నిబంధనలు సవరించాలని గంగూలీకి సూచించారు. అలా చేస్తే పేసర్లకు కొంత స్వేచ్ఛ లభిస్తుందని, ఆటలో బ్యాట్-బాల్ మధ్య సమతౌల్యం కొనసాగుతుందని గావస్కర్ అభిప్రాయపడ్డారు.

వేద న్యూస్

శనివారం మే 09, 2026


# వంద కోట్ల సినిమాలు చేయాలనే కోరిక ఉంది..



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో 'జాతిరత్నాలు' సినిమాతో ఒక్కసారిగా ప్రేక్షకుల మనసులు దోచుకున్న నటి ఫరియా అబ్దుల్లా మరోసారి తన ఆసక్తికర వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. 'చిట్టి' పాత్రతో యువతలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాల భామ, ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ తన కెరీర్‌లో ఆశించిన స్థాయి విజయాలు మాత్రం అందుకోలేకపోతోంది. అయినప్పటికీ హిట్, ఫ్లాప్‌లను పట్టించుకోకుండా వరుసగా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఫరియా తన సినీ ప్రయాణం, స్టార్‌డమ్, వంద కోట్ల సినిమాలు, పాత్రల ఎంపికపై పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. సాధారణంగా హీరోయిన్లు భారీ బడ్జెట్ చిత్రాలు, స్టార్ హీరోల సినిమాలు, భారీ పారితోషికాలపై ఎక్కువగా దృష్టి పెడతారని భావిస్తుంటారు. కానీ తనకు మాత్రం ముందుగా కథ, పాత్ర, ఆ పాత్రలో నటిగా తనకు దొరికే సంతృప్తి ముఖ్యమని ఫరియా తెలిపింది. అయితే భారీ కమర్షియల్ సినిమాల్లో నటించడంపై కూడా తనకు ఆసక్తి ఉందని స్పష్టం చేసింది. "వంద కోట్ల సినిమా ఆఫర్ వస్తే నేనెందుకు చేయను? ఖచ్చితంగా చేస్తాను. అలాంటి సినిమాలు కూడా నటిగా మరింత పెద్ద స్థాయికి తీసుకెళ్తాయి. కానీ కేవలం డబ్బు లేదా స్టార్‌డమ్ కోసమే సినిమాలు చేయాలని నేను ఎప్పుడూ అనుకోను" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించింది. 'జాతిరత్నాలు' సినిమా తన జీవితాన్నే మార్చేసిందని ఫరియా గుర్తుచేసుకుంది. ముఖ్యంగా 'చిట్టి' పాత్రకు వచ్చిన ఆదరణ ఇప్పటికీ తనకు ప్రత్యేకంగా అనిపిస్తుందని చెప్పింది. ఆ సినిమా సమయంలో తనకు తెలుగు సరిగా రాకపోయినా, షూటింగ్‌లో అందరితో మాట్లాడుతూనే భాష నేర్చుకున్నానని తెలిపింది. డబ్బింగ్ చెప్పేటప్పుడు మొదట చాలా భయపడ్డానని, కానీ ప్రేక్షకులు తన వాయిస్‌ను కూడా ఇష్టపడటం చూసి ఆశ్చర్యపోయానని చెప్పింది. స్టేజ్‌పై ఇప్పుడు ధైర్యంగా మాట్లాడగలుగుతున్నానంటే దానికి కారణం తెలుగు ప్రేక్షకుల ప్రేమేనని ఫరియా పేర్కొంది. నటిగా మాత్రమే కాకుండా, తన వ్యక్తిత్వాన్ని కూడా అభిమానులు ఆదరించడం తనకు మరింత బాధ్యతను పెంచిందని తెలిపింది. ఇక తన కొత్త చిత్రం "గాయపడ్డ సింహం" గురించి కూడా ఆమె పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఈ సినిమాలో తన పాత్ర చాలా వినోదాత్మకంగా, కొత్త తరహాలో ఉంటుందని తెలిపింది. ముఖ్యంగా తన పాత్ర పరిచయ సన్నివేశం గురించి చెప్పిన విషయం ప్రస్తుతం వైరల్‌గా మారింది. సినిమాలో తాను స్టేజ్‌పై చాలా చెత్తగా డ్యాన్స్ చేస్తుండగా హీరో తన ఫ్రెండ్‌తో "ఇంత చెత్తగా డ్యాన్స్ చేస్తుందంటే ఖచ్చితంగా నాకు పడుద్దిరా" అని చెప్పే డైలాగ్ తనకు చాలా నచ్చిందని, అదే సినిమా చేయడానికి ప్రధాన కారణమైందని నవ్వుతూ చెప్పింది. ఈ సినిమా కథ వినగానే ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇస్తుందని భావించానని ఫరియా తెలిపింది. దర్శకుడు పవన్ సాధినేని కథను చెప్పిన తీరు, అలాగే దర్శకుడు తరుణ్ భాస్కర్ ఈ ప్రాజెక్ట్‌పై చూపిన నమ్మకం తనకు మరింత కాన్ఫిడెన్స్ ఇచ్చాయని వెల్లడించింది. సాధారణ కమర్షియల్ ఫార్మాట్‌కు భిన్నంగా ఉండే ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా నవ్విస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేసింది.ఇటీవల కాలంలో ఫరియా అబ్దుల్లా సోషల్ మీడియాలో కూడా మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. తన స్టైల్, హాస్యభరితమైన మాటలు, సింపుల్ అటిట్యూడ్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా యువతలో ఆమెకు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. సినిమాల్లో గ్లామర్‌తో పాటు కామెడీ టైమింగ్ కూడా చూపించగల హీరోయిన్‌గా ఫరియా పేరు తెచ్చుకుంది. ఇక ముందు కూడా తాను భిన్నమైన పాత్రలకే ప్రాధాన్యం ఇస్తానని, ప్రేక్షకులు గుర్తుంచుకునేలా ఉండే పాత్రల్లో నటించాలని ఉందని ఫరియా వెల్లడించింది. పెద్ద హీరోల సినిమాలు, భారీ బడ్జెట్ చిత్రాలు, మహిళా ప్రధాన కథలు.. ఏవైనా సరే కథ బలంగా ఉంటే తప్పకుండా చేస్తానని స్పష్టం చేసింది.

## హ్యాబిటాట్ ఫెస్టివల్‌కు '23' ఎంపిక




**వేద న్యూస్ డెస్క్:**

ప్రముఖ దర్శకుడు రాజ్ రాచకొండ తెరకెక్కించిన సామాజిక చిత్రం '23' మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో నిర్వహించనున్న 'హ్యాబిటాట్ ఫిల్మ్ ఫెస్టివల్–2026'కు ఈ చిత్రం అధికారికంగా ఎంపికైంది. ఇప్పటికే 'మల్లేశం', '8 ఏఎం మెట్రో' వంటి భావోద్వేగ ప్రధాన చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజ్ రాచకొండ.. ఈసారి వాస్తవ సంఘటనల ఆధారంగా బలమైన కథను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. 1991లో జరిగిన చుండూరు ఊచకోత, 1993 చిలకలూరిపేట బస్సు దహనం, 1997 జూబ్లీహిల్స్ బాంబు పేలుళ్ల వంటి సంఘటనల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందింది. సామాజిక అసమానతలు, కుల వివక్ష, న్యాయ వ్యవస్థలోని లోపాలను ప్రధానాంశాలుగా తీసుకుని తెరకెక్కించిన ఈ సినిమాలో భావోద్వేగ ప్రేమకథను కూడా మేళవించారు. ఇప్పటికే ఈ చిత్రం 'గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు'ను అందుకుని విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ఈ చిత్రంలో తేజ, తన్మయి, పావన్ రమేష్, ఝాన్సీ ప్రధాన పాత్రల్లో నటించారు. మే 22న సాయంత్రం 4 గంటలకు స్టెయిన్ ఆడిటోరియంలో ఈ చిత్ర ప్రదర్శన జరగనుంది. ప్రవేశం ఉచితమే అయినప్పటికీ.. ముందస్తు నమోదు తప్పనిసరి అని చిత్రబృందం వెల్లడించింది.

## 'సతీ లీలావతి' ఎలా ఉందంటే?

**వేద న్యూస్ డెస్క్:**



వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న లావణ్య త్రిపాఠి నటించిన తాజా కుటుంబ కథా చిత్రం 'సతీ లీలావతి' నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భార్యా భర్తల మధ్య పెరుగుతున్న దూరాలు, అపార్థాలు, భావోద్వేగాల నేపథ్యంలో దర్శకుడు తాతినేని సత్య ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చివరకు ఈ దంపతుల బంధం ఏ దిశగా వెళ్లింది? అనేదే సినిమా ప్రధాన కథ. సినిమాలో లావణ్య త్రిపాఠి నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. భావోద్వేగ సన్నివేశాల్లో ఆమె నటన సహజంగా అనిపిస్తుంది. భర్తతో సంబంధం దెబ్బతిన్న మహిళ పాత్రలో మంచి అభినయం కనబరిచారు. దేవ్ మోహన్ తన పాత్ర పరిధిలో నటించాడు. నరేష్, పవిత్ర లోకేష్, సప్తగిరి తదితరులు తమ పాత్రలకు న్యాయం చేశారు. దర్శకుడు చెప్పాలనుకున్న అంశం మంచిదే అయినప్పటికీ, కథనంలో కొత్తదనం లేకపోవడం సినిమాకు పెద్ద లోపంగా మారింది. మొదటి భాగం కొంతవరకు ఆసక్తికరంగా సాగినా, రెండో భాగంలో కథ గందరగోళంగా మారుతుంది. అవసరం లేని ట్రాక్స్, బలహీనమైన మలుపులు సినిమాను నెమ్మదింపజేస్తాయి. ముఖ్యంగా హాస్య సన్నివేశాలు ఆశించిన స్థాయిలో పనిచేయలేదు. సాంకేతికంగా చూస్తే సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ అందించిన నేపథ్య సంగీతం సినిమాకు బలం చేకూర్చింది. ఛాయాగ్రహణం కూడా ఆకట్టుకుంటుంది. నిర్మాణ విలువలు బాగున్నాయి. మొత్తానికి 'సతీ లీలావతి' మంచి సందేశంతో తెరకెక్కిన కుటుంబ కథా చిత్రం. కానీ బలమైన కథనం, ఆసక్తికరమైన స్క్రీన్‌ప్లే లేకపోవడంతో పూర్తి స్థాయిలో మెప్పించలేకపోయింది. భావోద్వేగ కుటుంబ కథలను ఇష్టపడే ప్రేక్షకులు ఒకసారి చూడొచ్చు.

# ఎన్టీఆర్ కొత్త లుక్ వైరల్..



**వేద న్యూస్ డెస్క్:**

యంగ్ టైగర్ ఎన్టీఆర్‌కు సంబంధించిన కొత్త ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ పంచుకున్న ఈ నలుపు–తెలుపు చిత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ఎన్టీఆర్ పూర్తిగా కొత్త స్టైల్‌లో కనిపించడంతో అభిమానులు ఫిదా అవుతున్నారు. తడిసిన జుట్టు, ట్రిమ్ చేసిన గడ్డం, నోటిలో టూత్‌పిక్‌తో ఎంతో ఇంటెన్స్ మాస్ లుక్‌లో ఎన్టీఆర్ కనిపించాడు. గత చిత్రాలతో పోలిస్తే మరింత సన్నగా, స్టైలిష్‌గా మారిన ఆయన రూపం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఫొటోను పంచుకున్న తమన్ కూడా ఎన్టీఆర్ స్టైల్‌పై ప్రశంసలు కురిపించినట్లు తెలుస్తోంది. అభిమానులు అయితే ఈ లుక్ చూసి "ఇదే అసలైన మాస్ అవతార్" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఆయన ఫిజిక్‌లో వచ్చిన మార్పు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇక ఈ కొత్త లుక్ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించబోతున్న 'డ్రాగన్' చిత్రం కోసమేనన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రశాంత్ నీల్ సినిమాల్లో హీరోలు పవర్‌ఫుల్, రఫ్ అండ్ రా స్టైల్‌లో కనిపిస్తుంటారు. ఎన్టీఆర్ తాజా రూపం కూడా అదే తరహాలో ఉండటంతో అభిమానులు ఈ అంచనాలు వేస్తున్నారు. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. ఎన్టీఆర్ అభిమానులు కొత్త పోస్టర్లు, ఎడిట్లతో నెట్టింట హల్‌చల్ చేస్తున్నారు. ఇక యంగ్ టైగర్ తదుపరి చిత్రం కోసం అభిమానులు మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## 'పెద్ది' సెట్స్‌లో చిరంజీవి సందడి

**వేద న్యూస్ డెస్క్:**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ యాక్షన్ చిత్రం 'పెద్ది' షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న వేళ.. తాజాగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా సినిమా సెట్స్‌కు వెళ్లి చిత్రబృందాన్ని ఉత్సాహపరిచారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో కుస్తీ క్రీడ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నాడు. ఇటీవల విడుదలైన 'పెద్ది పెహిల్వాన్' గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో షూటింగ్ జరుగుతున్న ప్రదేశానికి చిరంజీవి వెళ్లి అక్కడి వాతావరణాన్ని దగ్గరుండి పరిశీలించారు. రామ్ చరణ్ లుక్, సెట్స్ నిర్మాణం, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ విధానం చూసి చిరంజీవి ఎంతో ఆనందం వ్యక్తం చేసినట్లు సమాచారం. షూటింగ్ విరామ సమయంలో చిత్రబృందంతో చిరంజీవి సరదాగా ముచ్చటించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా పనితీరును ప్రశంసిస్తూ సినిమా విజయం ఖాయమని నమ్మకం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సెట్స్‌లో చిరంజీవి సందడి చేయడంతో యూనిట్ సభ్యుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు తన సామాజిక మాధ్యమ ఖాతాలో వీడియోను పంచుకుంటూ.. "మెగాస్టార్ మా సెట్స్‌కు రావడం మా అదృష్టం. ఆయన మాటలు మాకు మరింత ప్రేరణ ఇచ్చాయి" అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ భావోద్వేగాలు, కుస్తీ పోటీలు, మాస్ యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే నెలలో ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.

## సూర్యపై క్రష్ ఉందన్న లైలా

**వేద న్యూస్ డెస్క్:**



ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ కథానాయికగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన లైలా చాలా కాలం తర్వాత మళ్లీ టాలీవుడ్‌లో సందడి చేస్తున్నారు. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా తమిళ స్టార్ హీరో సూర్యపై తనకు ఉన్న అభిమానాన్ని సరదాగా వెల్లడించడం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న లైలా తన సినీ ప్రయాణం, రీఎంట్రీ అనుభవాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా హీరో సూర్య గురించి ప్రస్తావిస్తూ.. "నాకు సూర్యపై చాలా పెద్ద క్రష్ ఉండేది. ఆయన నటన, వ్యక్తిత్వం నాకు చాలా ఇష్టం" అంటూ నవ్వుతూ చెప్పారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. అలాగే చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ తెలుగు సినిమాలో నటించడం ఎంతో ఆనందంగా ఉందని లైలా తెలిపారు. ప్రస్తుతం విడుదలైన 'గోదారి గట్టుపైన' చిత్రంలో నటించడం తనకు మంచి అనుభూతినిచ్చిందని చెప్పారు. ముఖ్యంగా గోదావరి ప్రాంతపు సహజ వాతావరణం, కథలోని భావోద్వేగాలు తనను బాగా ఆకట్టుకున్నాయని వెల్లడించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073